త్రైలోక్య గీత

తృతీయ అధ్యాయము
యోగవిచారయోగము

త్రైలోక్యా ఉవాచ:-
ఉచ్యతే భగవద్గీతా, నామ్నా భగవత స్సు్తమః |
భక్తనామ్నా కథం గీతం, అనసూయాత్రి నందన! ||3.1||

[కుమారి త్రైలోక్య ప్రశ్న:-
ఓ అనసూయ అత్రి నందనా! భగవద్గీత భగవంతుని పేరు మీదుగా వ్రాయబడినది కదా!
ఈ గ్రంథమును త్రైలోక్య అను ఒక భక్తురాలి పేరు మీదుగా వ్రాయబడటమును ఎలా ప్రశంసించగలము?]

శ్రీ శ్రీ శ్రీ దత్త స్వామి సమాధానము:-

కృష్ణేన కవినా నైవ, తన్నామకరణం కృతమ్ |
కృతా వ్యాసేన భక్తేన, భగవత్కీర్తి కామినా ||3.2||

[అర్జునునికి భగవానుడైన శ్రీకృష్ణుడు ఉపదేశించిన భగవద్గీతకు ఆ పేరు కృష్ణుడు ఇవ్వలేదు. భక్తుడైన వ్యాసుడను ఋషి ద్వారా ఆ గ్రంథ నామకరణము జరిగింది. భక్తుడైన వాడు కీర్తినెపుడూ భగవంతునికి ఆపాదిస్తాడు తప్ప తనకు కీర్తి కావాలని కోరడు.]

ఏవమేవ యే యథా మాం, ఇత్యుక్తే భక్త కీర్తిదః |
భగవానపి గీతేయం, త్వన్నామ్నా ప్రాగపీరితమ్ ||3.3||

[ఇదే విధంగా భగవంతుడు కూడా తన కీర్తినెపుడూ తనకు కాక తన భక్తులకే ఇవ్వాలనుకుంటాడు. భగవద్గీతలో భగవానుడు తాను భక్తుల ప్రతిబింబమేనని చెప్పాడు.(**యే యథా**

మాం...). కావున ఈ గీతకు నీ పేరు ఇవ్వబడింది. ఇదే విధంగా నేను ఇదివరకు లక్ష్మణ గీత, రోహిత గీత కూడా చెప్పి ఉన్నాను.]

కుర్యాదర్జున గీతేతి, నామ కృష్ణః దివో భువమ్ |
స ప్రాప్తః కీర్తి వైరాగ్యాత్, నిత్య స్తోత్ర పరాఙ్ముఖః ||3.4||

[తాను గానం చేసిన గీతకు కృష్ణ భగవానుడు భగవద్గీత అని నామకరణం చేయలేదు. ఒకవేళ, తాను చేయవలసిన అవసరం వచ్చినట్లు అయితే, భక్తవత్సలుడగు కృష్ణుడు అర్జునుని కీర్తిని కాంక్షించి 'అర్జునగీత' అని నామకరణం చేసి ఉండెడివాడు. దీని నామకరణము భగవత్కీర్తిని కోరుకునే భక్తుడైన వ్యాసునిచే భగవద్గీతయని పేరు పెట్టబడినది. భగవంతుడు తన దివ్యలోకమునుండి ఈ క్రింది మర్త్యలోకమునకు అవతరించునపుడు ఈ మర్త్యలోకములో కీర్తిని కాంక్షించడు. ఏలననగా, తన లోకములో భక్తులగు దేవతల మరియు ఋషుల నిత్య స్తోత్రములచే కీర్తియందు వెగటు చెంది ఈ మర్త్యలోకమునకు వచ్చినవాడు కావున, మరల ఇచ్చట కీర్తిని కాంక్షించడు.

ఏకదైవం హరి ర్భక్తాన్, ప్రార్థయన్ దూషణాతురః |
సుహృద్ద్వేషి పథో రేక–పథా తావన్యదాశ్రితౌ ||3.5||

[ఒకసారి శ్రీవిష్ణుభగవానుడు నిరంతరాయంగా తన స్తోత్రగానములను వినుట చేత వెగటుతో భూమి పైకి అవతారముగా రావాలనుకున్నారు. అతడు తన భక్తులందరినీ కూడా తనతో భూమిపై అవతరించవలసినది అని కోరారు. ఇంకా విశేషంగా కొందరు భక్తులు తనకు శత్రువులై వచ్చి తనను విమర్శించి, దూషించి తన ఇష్టమును నెరవేర్చమని కోరాడు. భగవానుడు భక్తులకు రెండింటిలో ఒక అవకాశమును ఎంచుకోమన్నారు. 1.

భక్తులు భూమి మీద శత్రువులుగా పుట్టి తనను విమర్శిస్తూ, తనతో యుద్ధంచేస్తూ తనను కేవలం మూడు జన్మలలో తిరిగి చేరవచ్చును. 2. మిగిలిన రెండవ అవకాశం, భూమి మీద తన భక్తులుగా జన్మించి, తమ ఆధ్యాత్మిక సాధనను ప్రారంభించి, చిట్టచివరగా ఏడు జన్మలలో తనను చేరగలరని తెలిపారు. భక్తులెవ్వరూ మొదటి మార్గాన్ని ఎంచుకునే ధైర్యం చేయలేకపోయారు. కాని ద్వారపాలకులైన జయ, విజయులు ఈ మార్గమును ఎంచుకున్నారు. దీనిని అనుసరించి జయవిజయులు శత్రువులైన హిరణ్యాక్ష - హిరణ్యకశిపులుగా, రావణ - కుంభకర్ణులుగా, శిశుపాల - దంతవక్త్రులుగా మూడు సార్లు భూమిపై జన్మించారు.]

అంత్యే జన్మని సోఽవర్షత్, దూషణాని స తం గతః |
రమతే య స్సుఖం దుఃఖం, సమం యోగీ స గీయతే ||3.6||

[చివరిదైన మూడవ జన్మలో శిశుపాలుడు అతివృష్టి వలె నిరంతరాయమైన దూషణభాషణములతో భగవంతుని ఎంతో సంతోషపెట్టాడు. అందుకే శిశుపాలుని ఆత్మ జ్యోతి రూపమై భగవానుని హృదయంతో మమేకమైంది. ఎవరైతే సుఖదుఃఖాలను సమానంగా ఆనందిస్తాడో అతనిని యోగి అంటారు అని భగవద్గీతలో చెప్పబడింది. (**సమత్వం యోగ ఉచ్యతే**...)]

మధుక్షారాశనశ్చిత్రే , సమ కష్ట సుఖో యథా |
తథా నిత్యం స రమతే, యథాహం జగదాశ్రితః ||3.7||

[భోజనంలో తీపి కారం పదార్థాలను ఒక మనిషి ఎలా ఆనందిస్తాడో, చలనచిత్రంలో సంతోషకర సన్నివేశాలు, దుఃఖపూరితమైన సన్నివేశాలు చూస్తూ ఒక మనిషి ఎలా ఆనందిస్తాడో అదే విధంగా **నేను** మానవావతారుడనై వచ్చినపుడు సుఖదుఃఖాలను సమంగా

ఆనందిస్తాను. ఈ ప్రపంచంలో యోగి కూడా ఇలాగే సుఖదుఃఖాలను సమంగా ఆనందిస్తాడు.]

ఏకైకం క్రమతః కృత్వా, సుఖదుఃఖే సదా ప్రియమ్ |
కరోతి జీవిన స్సర్వాన్, స్వభక్తాన్ నిత్య యోగినః ||3.8||

[ఒకవేళ జీవుడొకడు కొంతకాలం పాటు పుణ్యకర్మలు, మరికొంత కాలం పాటు పాపకర్మలు చేసినప్పటికినీ, భగవంతుడు వాని ఫలితాలను ఒకదాని తర్వాత ఒకటిగా అమర్చి తన భక్తులకు నిరంతరాయమైన సుఖం కాని, నిరంతరాయమైన దఃఖం కాని విసుగెత్తించకుండా చేస్తాడు. ఈ విధంగా తన భక్తులు నిరంతరం సంతోషంగా ఉండి యోగి వలె ఆనందంగా ఉండే మార్గమిస్తాడు.]

మిథ్యాజీవో జగన్మిథ్యా, స్వాంశో న చలచిత్రవత్ |
పరమార్థ సదేకం తత్, తద్యోగ స్తద్దయావశః ||3.9||

[చలనచిత్రంలో సంతోషకర సన్నివేశాలు, దుఃఖ పూరితమైన సన్నివేశాలు చూసి ఒకేలా ఆనందించే ప్రేక్షకుని వలె, జీవుడు సుఖదుఃఖాలను సమంగా ఆనందించడమే యోగం అనబడుతుంది. భగవంతుడు ఇలా ఆనందించగలడు. ఎందువల్ల అంటే భగవంతుడు యథార్థమైన సత్యం, అయితే తన సృష్టి మాత్రం సాపేక్ష సత్యం. ప్రేక్షకునికి చలనచిత్రం కూడా సాపేక్ష సత్యమే. కాని మానవుడు భగవంతుని సృష్టిలో ఒక చిన్న సృష్టి భాగము మాత్రమే. కావున మానవుడునూ సాపేక్ష సత్యము. కావున యథార్థ సత్యమైన ఈశ్వరుడు (సృష్టిని చూసేవాడు) చలనచిత్రమును (సాపేక్ష సత్యమైనది) చూసి ఆనందించినట్లు సృష్టిని చూసి ఆనందించగలడు కానీ సాపేక్ష సత్యమైన మానవుడు సాపేక్ష సత్యమైన సృష్టిని అలా ఆనందించలేడు. ఏ జీవుడైనా ఈశ్వరుని వలె ఈ సృష్టిని వీక్షించదలిచినట్లైతే, తన భక్తి కారణంగా

భగవంతుని అనుగ్రహమును పొంది ఇటువంటి యోగమును పొందగలరు.]

యోగప్రాప్తిః ప్రయుక్తోఽయం, తస్య లాభే తదంశకే |
అరోగో భోగ మూలం చ, సోఽపి యోగీతి కథ్యతే ||3.10||

[ప్రతి సందర్భం లోనూ యోగము అంటే పతంజలి సూత్రీకరించిన అష్టాంగయోగము మాత్రమే కాదు. యోగము అంటే దేనినైనా పొందడము. ఉదాహరణకు ధనయోగము అంటే సంపదను పొందటము. కాకపోతే యోగము అనే శబ్దమును 'భౌతిక విషయములను పొందటం' కొరకు కాకుండా సాధారణంగా భగవంతుడిని పొందటము లేదా ఆధ్యాత్మిక మార్గంలో విజయవంతంగా ముందుకు వెళ్తున్న ఒక్కొక్క సోపానమును ఒక్కొక్క యోగముగా ప్రయోగిస్తాము. ఉదాహరణకు, భగవంతుని సేవ చేయుటకు "ఆరోగ్యకరమైన శరీరంలో ఆరోగ్యకరమైన బుద్ధి" చాలా అవసరము. ఇదే అంశము ప్రాపంచిక సుఖాలను అనుభవించడానికి కూడా అవసరమే. ప్రస్తుతము జనులంతా శారీరక మానసిక ఆరోగ్యం పొంది, తద్వారా ప్రాపంచిక విలాసాలను అనుభవించడానికి తాపత్రయపడుతున్నారు. అంతే కాదు దీనినే వారు యోగాభ్యాసము అని కూడా అంటున్నారు.]

ఉపమానాబ్జచక్రాణి, తీర్త్వా బుద్ధిప్రమాపథా |
మనః కుండలినీ దైవం, సహస్రదళగం విశేత్ ||3.11||

[పతంజలి యోగమును పూర్తిగా అపార్థం చేసుకుంటున్నారు. అజ్ఞాన జనులు చక్రాలను లేదా కమలములను వెన్నెముక లేదా మేరుదండం పైన ఉన్నట్లు ఊహించి, కుండలిని పాము వలె వక్రమార్గంలో చక్రాలను దాటుతూ పయనించి, తల పై భాగంలో పరబ్రహ్మ కొలువుండే సహస్రారమనే వేయి దళముల కమలమును చేరునని ఊహిస్తున్నారు. నిజానికి ఇది ప్రతీకాత్మక

వర్ణన మాత్రమే. ప్రాపంచిక బంధాల ప్రభావములను దాటుతూ తల పై భాగాన ఉన్న భగవంతుడిని చేరటం అంటే భగవంతుని వద్దకు చేర్చగల ఆధ్యాత్మిక జ్ఞానమార్గం చూపగల మేధస్సు అని అర్థము.]

మనశ్చిచ్ఛక్తి వీచిస్తత్, సర్వస్తర్కా దళాని చ |
స్వోచితం దైవరూపం చ, కృష్ణం మర్త్య ముని శ్రితః ||3.12||

[మనస్సు అంటే చైతన్యం. చైతన్యం అనేది జడశక్తి రూపాంతరము. ఇది తరంగరూపము కావున సర్వగతిలో ప్రయాణిస్తుంది. సహస్రారంలో వేయిరేకుల కమలం అంటే వేల కొలది తర్కసంగత చర్చల ద్వారా సత్య నిర్ధారణ చేయడము. అనగా, అనేకానేక చర్చల అనంతరం సాధకుడు సత్యమైన భగవంతుని, అంటే మానవులు తమ సజాతి సంబంధిత దైవరూపమును అన్వేషించి అట్టి నరావతారమునకు దగ్గర కావడమే యోగము. చివరగా తెలిసేదేమిటంటే అనూహ్య పరబ్రహ్మమును గాని పరమ సత్యరూపమును గాని మనం ఎప్పటికీ చేరలేము. కాని ఆ అనూహ్య పరబ్రహ్మం ప్రవేశించినట్టి, తమ జాతిరూప సంబంధిత దైవమునే చేరవలసి ఉన్నది. శ్రీకృష్ణుడు మానవరూపము ధరించిన దైవము, పరబ్రహ్మము. గోపికలుగా వచ్చిన ఋషులు మానవులు కావున వారిజాతికి సంబంధించిన మానవ రూపంలో వచ్చిన శ్రీకృష్ణ పరబ్రహ్మమును తెలిసికొని, ఆయన వద్దకు చేరినారు.]

మూలాధారః ప్రసూస్తాతో, మణిపూరో ధరాంబువత్ |
స్వాధిష్ఠానో ऽనలః కామః, హృది పుత్రోహ్య నాహతః ||3.13||

[అట్టడుగున ఉన్న మూలాధార చక్రం తల్లికి, దాని పైన ఉన్న మణిపూరము తండ్రికి ప్రతీకలు. ఈ రెండు క్రమముగా పృథ్వీ తత్త్వము, జల తత్త్వములు. ఆకాశం నుండి కురిసే వర్షము అనే

'తండ్రి యొక్క శుక్రం' భూమి పైన కురియడం అంటే 'తల్లి గర్భంలో ప్రవేశించడమే'. మొలకెత్తే విత్తనాలే జన్మించిన శిశువులు. ఈ రెండు చక్రాలు తల్లిదండ్రుల పైన గల ప్రేమకు ప్రతీకలు. దీని పైన గల స్వాధిష్ఠాన చక్రము అగ్నితత్త్వంతో కూడినందున ఇది కామమునకు మూలము. జీవితభాగస్వామితో గల బంధమునకు ఇది ప్రతీక. దీని పైన ప్రేమకు నెలవైన హృదయస్థానము నందు ఉండేది అనాహతచక్రము. ఇది అత్యంత దృఢమైనది - వాయు తత్త్వము. అందుకే దీనిని ఎవరూ దాటలేనిది అనే అర్థమును కలిగి ఉంది. ఇదే సంతాన బంధము.]

విశుద్ధో వ్యోమ వాచా హి, గురవో జ్ఞాన దోషిణః |
ఆజ్ఞాచిత్తం భిన్నరూప-భిన్నదైవ భ్రమాస్పదమ్ ||3.14||

[దీని పైన భాగంలో విశుద్ధ చక్రం ఉంటుంది. అనేకమైన మిథ్యా గురువుల స్వరం నుండి వెలువడే అసత్య బోధనలు ఆకాశ తత్త్వము (శూన్యము)నకు ప్రతీకలు. దీని పైన ఉండే ఆజ్ఞాచక్రము మనస్సును సూచిస్తుంది. మనస్సు లోని అసంబద్ధమైన జ్ఞానము కారణంగా ఉన్న ఒక్కగానొక్క అనూహ్య పరబ్రహ్మమునే అనేకమైన దేవతలు దేవుళ్ళ రూపంలో ఉన్నట్లు భ్రమింపజేసి, వారిలో ఒకరు లేదా కొందరు దైవరూపాలే మాత్రమే అసలైన దైవమని, ఆ దైవరూపాలనే ఇష్టపడుతూ, మిగిలిన రూపాలను ద్వేషిస్తారు.]

వ్యర్థా భ్రమం సదిచ్ఛంతి, చక్రపద్మోపమాభ్రమః |
ఆవర్తో హి తితీర్షోశ్చ, భృంగ బంధాయ వారిజమ్ ||3.15||

[భగవంతునితో గల బలహీనమైన బంధం వలన ప్రాపంచిక బంధాలను దాటలేని భక్తులు వాస్తవమును తప్పుదోవ పట్టించి రూపొందించిన మిథ్యా విధానమే ఈ చక్రాలు, కమలపుష్పాలు, కుండలినీ వక్రగమనములు. ఈ చక్రాలకు ఆధారమైనది

వెన్నెముక. వివిధ ప్రాపంచిక బంధాలకు కారణమైన చైతన్యము, రూపాంతరమును చెంది, అనేక ప్రాపంచిక బంధాలను స్థాపించెడి మనసుగా మారే క్రమంలో, ఈ రెండింటి మధ్య వెన్నుపాము యానకం వంటిది. ప్రపంచమనే సముద్రంలో ఈ చక్రాలు సుడిగుండాల వంటివి. సముద్రమును దాటుటకు ఈదుతున్న భక్తునికి ఇవి ఎన్నో ఆటంకాలు కలిగిస్తాయి. కొంతకాలంపాటు ఈ చక్రాలు ఈదుతున్నట్టి భక్తునికి సద్వినోదం కలిగిస్తాయి, కాని చివరికి ముంచేస్తాయి. ఈ ప్రాపంచిక బంధాలు కమలపుష్పాలతో కూడా పోల్చతగినవి. ఎలాగంటే కమలం నల్లని (నలుపు తమస్సు లేదా అజ్ఞానమునకు ప్రతీక) భ్రమరమనే జీవాత్మను ఆకర్షించి తనవైపు లాగేసిన తరువాత ఆకర్షక పత్రాలను మూసి చివరికి దానిని తనలోనే బంధిస్తుంది. ఈ విధమైన ప్రతీక రూప అంతరార్థమును విశ్లేషించి అర్థం చేసుకోకుండా, తత్త్వవివరణలో పోలిక కోసం ఉపయోగించిన ఉపమానాలనే, నిజమైన విషయమని భ్రమపడుతున్నారు.]

దత్తాత్రేయో యోగిరాజో, యోగం జానాతి కేవలః |
అన్యే యోగం న జానంతి, యోగమాయా విమోహితాః ||3.16||

[యోగిరాజు అయిన దత్తాత్రేయుడు మాత్రమే యోగమును తెలిసిన వాడు. తాను మినహా మరెవ్వరూ యోగము యొక్క అర్థమును వివరించలేరు. మిగతా వారి అజ్ఞానముకు మూలకారణమేదో అదే 'యోగము' యొక్క అర్థమును కూడా వక్రీకరించి అసత్య విధానమును బోధించి, ఫలితంగా ప్రాపంచిక బంధాల మధ్య ఆకర్షణకు దారితీస్తుంది.]

యోగేన తస్య జాయంతే, సర్వయోగ విభూతయః |
యాభిర్నాస్తిక విశ్వాసః, ప్రాద్యో హి ఫలకాక్షరః ||3.17||

[మహిమలకు మూలమైన అనూహ్య పరబ్రహ్మమును పొందినవాడు మాత్రమే మహిమలు చూపగలడు. వివరించడానికి వీలుకాని ఇట్టి మహిమలు నాస్తికులలో భగవంతుని యందు విశ్వాసమును కలిగించుటకు ఉపయోగపడతాయి, ఇవి పిల్లవానికి పలక మీద అక్షరాలు నేర్పెడి మొట్టమొదటి సోపానము వంటివి.]

విద్యా సంస్థ స్తతో జ్ఞాన-భక్తి కర్మ దశా క్రమాత్ |
ఆస్తికాః క్షీణ విశ్వాసాః, స్వలాభా వా విభూతిగాః ||3.18||

[పలక మీద వ్రాసి అక్షరాలు నేర్చిన పిదప పిల్లవాడు పాఠశాలలో, కళాశాలలో మరియు విశ్వవిద్యాలయములో ప్రవేశించి పెన్ను మరియు పేపరును ఉపయోగిస్తాడు. ఇప్పుడతనికి పలకతో పనిలేదు. అదే విధంగా నాస్తికుడు ఆస్తికుడుగా మారిన పిదప మహిమలతో పని లేదు. ఆస్తికునికి ఇప్పుడు కావలసినది ఆధ్యాత్మిక జ్ఞానము (జ్ఞాన యోగము), భక్తి (భక్తి యోగము) మరియు సాధన (కర్మ యోగము) అన బడే క్రమము పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయము లాంటివి. ఒకవేళ ఆస్తికులు కూడా మహిమలు చూడగోరుతున్నారు అంటే మాత్రము వారికి భగవంతునిపై పూర్ణవిశ్వాసం అయినా లేకుండా ఉండి ఉండాలి లేదా ఆ మహిమశక్తిని తమ ప్రాపంచిక సమస్యల పరిష్కారమునకు ఉపయోగించే ఉద్దేశమైనా ఉండి ఉండాలి.]

సర్వేఽప్యన్యే తతద్విభూతేః, ప్రాధాన్య మాది దోషతః |
శంకర ద్వారయానం తత్, నోఽలం న చ తథా పురా ||3.19||

[ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ నాస్తికులు లేదా ఆస్తికులే అయినా మహిమల ద్వారా తమ ప్రాపంచిక సమస్యల పరిష్కారం పొందాలని కోరువారే. అందుకే నేను మహిమల యొక్క ప్రాముఖ్యత తెలుపుతున్నాను. ప్రతి పని ఆరంభంలో దోషములతో కూడి ఉంటుంది ఎలాగంటే అగ్ని పొగతో ఆరంభం అయినట్లు.

ఇప్పటి కలియుగంలో ఆధ్యాత్మికత స్థాయి అత్యంత హీన దశలో ఉంది. ఒకప్పుడు ఆదిశంకరులు మూసి గడియ వేసిన తలుపుల నుండి మండన మిశ్రుని ఇంటి లోనికి ప్రవేశించుట ఇప్పుడున్న మనం చూస్తే గనక శంకరులు భగవంతుని అవతారమని నమ్మడానికి అదొక్కటే సరిపోయేది. అతనితో సుదీర్ఘ చర్చోపచర్చల జ్ఞానయోగం ద్వారా తాను భగవంతుడేనని నిర్ధారించే అవసరమే మనకు ఉండేది కాదు. కాని ఆనాడు మండనమిశ్రునితో పాటు ఉన్న జైమిని మరియు వ్యాసుల వారు ఆదిశంకరులు ప్రదర్శించిన మహిమకు ఎలాంటి ప్రాధాన్యతను ఇవ్వకుండా సుదీర్ఘ చర్చోపచర్చల తర్వాత మాత్రమే వారిని భగవంతుడైన అవతారపురుషునిగా అంగీకరించారు. కలియుగం రాక ముందు ప్రతి ఒక్కరూ గొప్ప భక్తులై ఉన్నందున సహజరీతిగా వారికి మహిమలు చేసే శక్తి ఉండేది. కావున ఆ రోజులలో దివ్యత్వము అనేది మహిమల ప్రదర్శన ఆధారంగా కాకుండా జ్ఞాన యోగము, భక్తియోగము మరియు కర్మ యోగము ద్వారానే నిర్ణయింపబడేది.]

అనూహ్యా గమ్యతే తాభిః, దైత్యశ్చ తపసా వ్రజేత్ |
దైవేన దీయతే యాభిః, స్థాప్యతే నోహ్య ఈశ్వరః ||3.20||

[అనూహ్య పరబ్రహ్మముచే ప్రదర్శింపబడిన మహిమలను చూసి ఆస్తికులుగా మారతారని ఆశించినప్పటికీ, వారు తమ మూర్ఖస్వభావంతో, ఇంతకాలంగా తమలో గూడు కట్టిన అంధవిశ్వాసం కారణంగా నమ్మలేక పోతున్నారు. నిజానికి అద్భుతమైన మహిమల ప్రదర్శన అనునది దానికి మూలకారణం అయిన అనూహ్య పరబ్రహ్మమునే సూచిస్తుంది. అయితే కొన్నిసార్లు రాక్షస ప్రవృత్తి గలవారు కొందరు, తమ మొండి తపస్సుల ద్వారా భగవంతుడి నుండి పొందిన వరముల చేత కొన్ని మహిమలు ప్రదర్శించగలరు. దానవులు తమ రాక్షస ప్రవృత్తిని ప్రక్కన పెట్టి అనూహ్య పరబ్రహ్మము యొక్క ఉనికిని విశ్వసించారు కావున భగవంతుడు వారికి అటువంటి శక్తిని ఇస్తాడు.

వరము ద్వారా పొందిన మహిమలు ప్రదర్శించి, రాక్షసులు భగవంతుని ఉనికిని చెప్పకనే చెబుతున్నారు. ఇది మంచి ప్రయోజనము కావున భగవంతుడు దీనిని ప్రోత్సహిస్తున్నాడు.]

ఇతి త్రైలోక్యగీతాయాం యోగవిచారయోగో నామ
తృతీయాధ్యాయః

ఈ విధంగా త్రైలోక్యగీత యందు
తృతీయ
అధ్యాయము 'యోగవిచారయోగము' పరిసమాప్తము.